## రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు పది ప్రాజెక్టులు

రామగిరి, జనవరి 22 : ఈ నెల 1 నుంచి 19 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ చూపిన పది ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు డీఈఓ భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారికి నేడు, రేపు ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ చూపి జాతీయ స్థాయికి వెళ్లి జిల్లా ఖ్యాతి చాటాలని కోరారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్షీపతిని సంప్రదించాలని సూచించారు.

## 24న ఎన్‌ఎస్‌ఎస్ అధికారులకు వర్క్‌షాప్

**ఎంజీయూ కో ఆర్డినేట్ డాక్టర్ మద్దిలేటి**

రామగిరి, జనవరి 22 : మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల్లోని ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల నిర్వహణపై పీఓలకు ఈ నెల 24న వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల్లోగా ఎంజీయూలోని ఎన్‌ఎస్‌ఎస్ కార్యాలయానికి రావాలని సూచించారు. ముఖ్య అతిథిగా ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ గోపాల్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎన్‌ఎస్‌ఎస్ పీఓలను వర్క్‌షాప్‌కు పంపించాలని కోరారు.



నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న రామ భక్తులు

# సమష్టి కృషితో నల్లగొండను గెలుద్దాం

## కార్యకర్తలే పార్టీకి కథానాయకులు

- గత పొరపాట్లు పునరావృతం కావద్దు
- త్వరలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షలు
- కాంగ్రెస్ హామీలపై ప్రజల్లోకి వెళ్దాం
- పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి
- బీఆర్‌ఎస్ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు



తెలంగాణ భవన్‌లో సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, వేదికపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల, ఉమ్మడి జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు

నల్లగొండ ప్రతినిధి, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని, సమష్టి కృషితో నల్లగొండ లోక్‌సభ స్థానంలో గులాబీ జెండా ఎగురవేయాలని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి కథానాయకులని, వారి అవిరళ కృషితోనే పార్టీ క్షేత్ర స్థాయిలో ఇన్నాళ్లు బలంగా ఉన్నదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం పార్టీ నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ సమీక్షా సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. లోక్‌సభ నియోజకవర్గ నలుమూలల నుంచి అన్ని స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, నాయకులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులనుద్దేశించి కేటీఆర్ ప్రసంగిస్తూ రానున్న ఎంపీ ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా జరుగుతున్న సమీక్ష సమావేశాల్లో పాల్గొంటున్న పార్టీ శ్రేణులంతా మంచి ఆత్మవిశ్వాసంతో ఉన్నారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లోని లోటుపాట్లను విశ్లేషించుకుంటూ పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో ఎన్నికల ప్రచార సరళి మనకు అనుకూలంగా అనిపించినా ఫలితాలు మరోలా వచ్చాయని గుర్తు చేశారు. ఓటమి ఎదురవుతుందన్నట్లుగా ఎక్కడా అనుమానం రాలేదన్నారు. ఓటమికి అనేక కారణాలు ఉన్నాయంటూ పార్టీకి, ప్రభుత్వానికి మరింత సమన్వయం అవసరమన్న భావనతో కార్యకర్తలు ఉన్నట్లు వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో పార్టీ పట్ల జరుగుతున్న అసత్య ప్రచారంపై మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. లోక్‌సభ సమీక్షా సమావేశాల మాదిరిగానే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఫిబ్రవరి మొదటి వారం నుంచి సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అడ్డమైన హామీలు ఇచ్చిందని, వాటి అమలుపై ప్రజల్లోకి వెళ్దామని సూచించారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధం కావాలన్నారు. ప్రజల్లో కేసీఆర్‌పై ఉన్న సానుభూతిని లోక్‌సభ ఎన్నికల్లో అనుకూలంగా మలుచుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ నాయకులు నాయకులు, కార్యకర్తలు

### కోమటిరెడ్డి ఇంటికి కరెంటు బిల్లులు పంపాలి

ఎన్నికల ప్రచారంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నవంబర్ నెల నుంచే కరెంటు బిల్లులు కట్టవద్దని ప్రజలకు చెప్పారని గుర్తు చేస్తూ నల్లగొండ ప్రజలంతా తమ బిల్లులను కోమటిరెడ్డి ఇంటికి పంపాలని చెప్పారు. కాంగ్రెస్ నేతల హామీలపై ఎప్పటికప్పుడు ప్రజల్లోకి వెళ్తూ చైతన్యం చేయాలన్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టులో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే క్రాప్ హాలిడే ప్రకటించే దుస్థితి వచ్చిందని పేర్కొన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో చివరి ఆయకట్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఎండబెడుతుందని విమర్శించారు. ప్రాజెక్టులను కృష్ణా రివర్ బోర్డుకు అప్పగించి తెలంగాణ జుట్టును కేంద్రం చేతిలో పెడుతున్నదని ఆరోపించారు. నల్లగొండ మున్సిపాలిటీలో అవిశ్వాసం సాక్షిగా కాంగ్రెస్, బీజేపీల అక్రమ బంధం బయటపడిందని గుర్తు చేశారు.

### కోమటిరెడ్డి సీఎంను నిలదీయాలి : మాజీ మంత్రి హరీశ్‌రావు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను ముక్కలు చేస్తానని ప్రగల్భాలు పలుకడం మానుకుని రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు సూచించారు. కృష్ణా ఆయకట్టుకు అన్యాయం చేసేలా ప్రాజెక్టులను కృష్ణా రివర్ బోర్డుకు అప్పజెప్పేందుకు ప్రభుత్వం సంతకం పెట్టిందని ఆరోపించారు. ఇలా సంతకం పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డిని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిలదీయాలన్నారు. నల్లగొండ జిల్లాకు తాగు, సాగునీటి అవసరాలపై కోమటిరెడ్డి మాట్లాడితే మంచిదని హితవు పలికారు. కేసీఆర్ హయాంలో ఎస్‌ఆర్‌ఎస్‌పీ చివరి ఆయకట్టుకు సాగునీరు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో కాళేశ్వరం జలాలు వాడుకునే అవకాశం ఉన్నా ప్రభుత్వానికి అలాంటి ఆలోచనే లేదని విమర్శించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని అనేక సూచనలు వచ్చాయంటూ కష్టపడ్డ వారికే పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. ఉద్యమకారులకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, త్వరలోనే కమిటీలు వేసుకుందామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లోని 13 హామీలను లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మెడలు వంచాలంటే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పలువురు ముఖ్య నాయకులు మాట్లాడారు. పార్టీ నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, నల్లమోతు భాస్కర్‌రావు, గాదరి కిశోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్‌కుమార్, నాయకులు రాంచంద్రనాయక్, తిప్పన విజయసింహారెడ్డి, తేరా చిన్నపరెడ్డి, వేమిరెడ్డి నర్సింహారెడ్డి, చెరుకు సుధాకర్, మాలె శరణ్యారెడ్డి, పల్లె రవికుమార్‌గౌడ్, గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, వడ్త్యా రమేశ్‌నాయక్, కడారి అంజయ్యయాదవ్, నిరంజన్‌వలీ, గోపగాని వెంకట్‌నారాయణగౌడ్ పాల్గొన్నారు.

## అంతా రామమయం

- అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మార్మోగిన రామనామ స్మరణ
- భక్తులు కార్యక్రమాన్ని వీక్షించేలా ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు
- పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. భారీగా హాజరైన భక్తజనం

రామగిరి, జనవరి 22 : యావత్ హిందూ సమాజం వేచి చూసిన సుదీర్ఘ స్వప్నం సోమవారం సాకారమైంది. అయోధ్యలో నిర్మించిన రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ వేడుకను చూస్తూ భక్తులు తన్మయత్వం పొందారు. ఐదు శతాబ్దాలుగా ఎదురుచూసిన భక్తుల కల నెరవేరడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో భక్తులు అభిషేకాలు, పూజలు చేశారు. మరో వైపు రామనామ స్మరణ, భజనలతో ఆయా ప్రాంతాలు మార్మోగాయి. సీతారామచంద్ర, లక్ష్మణుల విగ్రహాలతో ఊరేగింపులు నిర్వహించారు. జై శ్రీరాం, జై జై శ్రీరాం అంటూ నినదించారు. పలుచోట్ల అన్నదానాలు, ప్రసాదాల వితరణతో అంతటా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. బాలరాముడి ప్రతిష్ఠను తిలకించేలా పలు ఆలయాల్లో నిర్వాహకులు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయడంతో ఆసక్తిగా తిలకించారు. సాధారణ భక్తులకు బాలరాముడి దర్శన భాగ్యం కల్పించడంతో భక్తులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రెండో భద్రాద్రిగా పేరుగాంచిన నల్లగొండలోని రామగిరిలో సీతారామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో భారీ స్క్రీన్స్ పెట్టి భక్తులకు రామప్రతిష్ఠ మహోత్సవాన్ని చూపించి ప్రసాదాలు అందజేశారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మరో వైపు మహిళలు తమ ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు. రాత్రి ఇండ్ల ముందు ప్రమిదలతో దీపాలు వెలిగించి భక్తిభావం చాటుకున్నారు. వీటీకాలనీలోని పంచముఖ హనుమాన్ దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి సింధూర అభిషేకం చేయించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు తండు సైదులుగౌడ్, బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెరుగైన ఆలోచన.. ఉజ్వల భవిష్యత్‌కు బాట

## కాలంతోపాటు వచ్చే మార్పులకు అనుగుణంగా కొత్త కోర్సులు చదువాలి

- పోటీ ప్రపంచంలో రాణించేలా విద్యనందించమే కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ లక్ష్యం
- కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆలిండియా డాక్టర్ జె.శ్రీనివాస్‌రావు
- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే – కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'లక్ష్యం–2024'
- ఇంటర్మీడియట్ తర్వాత విద్యావకాశాలపై నల్లగొండ ప్రగతి జూనియర్ కళాశాలలో సదస్సు



రామగిరి, జనవరి 22 : 'ఒక ఆలోచన రేపటి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. ఆ దిశగా ఉన్నత విద్య అందించే విద్యా సంస్థల్లో చేరితే ఆ లక్ష్యం నెరవేర్చుకునే అవకాశం లభిస్తుంది.' అని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆలిండియా డాక్టర్ జె.శ్రీనివాస్‌రావు వివరించారు. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో 'లక్ష్యం–2024' పేరుతో నల్లగొండలోని ప్రగతి జూనియర్ కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటర్మీడియట్ తర్వాత ఏం చదువాలి.. ఎలాంటి కోర్సులు చేయాలి.. ఎలాంటి విద్యా సంస్థను ఎంపిక చేసుకోవాలనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

### సీబీసీఎస్ కరిక్యులమ్‌తో కేఎల్ డీమ్డ్ విద్యా బోధన

ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. మూస విధానమైన కోర్సులు కాకుండా ఆధునిక టెక్నాలజీ మల్టీ డిస్‌ప్లెన్ డిగ్రీలు చదువాలని సూచించారు. అప్పుడే ఒక సబ్జెక్టు కాకుండా పలు సబ్జెక్టుల్లో నాలెడ్జ్ పెంచుకోవడంతోపాటు ఉద్యోగ సాధన సులభమవుతుందన్నారు. నేటి ఆధునిక కాలంలో చదివిన చదువుకు సర్టిఫికెట్ ముఖ్యం కాదు.. దానిలోని నాలెడ్జ్, సబ్జెక్టుపై పట్టు సాధించేలా నాణ్యమైన విద్య అవసరమని పేర్కొన్నారు. అందుకు ప్రతి విద్యార్థి సొంత ఆలోచనలతో లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువాలన్నారు. ఇందుకు నాణ్యత ప్రమాణాలతో బోధన అందించే సంస్థలు సైతం కీలక భూమిక పోషిస్తాయని చెప్పారు. ఇంటర్మీడియట్ పూర్తి చేయబోయే విద్యార్థులు ఉత్తమ బోధన, ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్స్ అందించే ఉన్నత విద్యా సంస్థలను ఎంపిక చేసుకోవాలన్నారు. నాలెడ్జ్ బేస్డ్ విధానంలో విద్యాబోధన సాగిస్తూ విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ బాటలు వేస్తున్నదని తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఇంత అవకాశం ఉన్న ఏకైక ప్రైవేట్ యూనివర్సిటీ ఇదేనన్నారు. నేటి ఆధునిక కాలానికి అనుగుణంగా చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్) విధానంలో మల్టీ డిసెప్లెన్ బీటెక్ కోర్సులను చదివే అవకాశం తమ యూనివర్సిటీ అందిస్తున్నదని తెలిపారు. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో సంవత్సరానికి రూ.45 లక్షల నుంచి ఆ పై జీతాలు సంపాదిస్తూ స్థిరపడ్డారని వివరించారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో చదివిన ప్రతి విద్యార్థికి వంద శాతం ప్లేస్‌మెంట్స్ కల్పించామన్నారు. విద్యాలక్ష్మి పోర్టల్‌తో ప్రభుత్వ స్కాలర్‌షిప్స్, విద్యా రుణాలు పొందే అవకాశం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులకు ఉన్నదన్నారు. తమ విద్యార్థులు పలువురు బీటెక్ తృతీయ సంవత్సరంలోనే కంపెనీలను ప్రారంభిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. కేఎల్ డీమ్డ్ 46 సంవత్సరాలుగా క్రమశిక్షణాయుతంగా అత్యుత్తమ ప్రమాణాలతో విద్యనందిస్తూ వస్తున్నదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సైతం ఇలాంటి అవకాశాలు కల్పించేలా నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే సామాజిక బాధ్యతగా అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్యం చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా సదస్సులో వేదికపై ధైర్యంగా మాట్లాడిన ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థిని జెనిరియా ముస్కాన్‌తోపాటు లక్కీ డ్రాలో పేర్లు వచ్చిన పి.పూజశ్రీ, ఆర్.మౌనికకు బహుమతులు అందజేశారు.

### విద్యార్థులను చైతన్యం చేయడం హర్షణీయం



బీటెక్‌లో ఎలాంటి కోర్సులు తీసుకోవాలి. ఎలాంటి కళాశాలలు, యూనివర్సిటీలను ఎంపిక చేసుకోవాలనే అంశాలపై నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ సదస్సు నిర్వహించి విద్యార్థులను చైతన్యం చేయడం హర్షణీయం. విద్యార్థులు ఇంటర్‌లోనే ప్రణాళికతో చదివి ఉత్తమ కోర్సుల్లో చేరాలి. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అందించే అవకాశాలు అద్భుతంగా ఉన్నాయి. మా కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు నేడు దేశ, విదేశాల్లో, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్నత హోదాల్లో ఉన్నారు. మాకు ఈ అవకాశం కల్పించడం సంతోషంగా ఉన్నది.

– ఎ.నరేంద్రబాబు, ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, నల్లగొండ



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆలిండియా డాక్టర్ శ్రీనివాస్‌రావు, ప్రగతి కాలేజీ యాజమ్యాం, నమస్తే తెలంగాణ బృందం



సదస్సుకు హాజరైన ఇంటర్ విద్యార్థినులు

### కేఎల్ డీమ్డ్‌లో చేరాలంటే సంప్రదించండి ఇలా

కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ హైదరాబాద్, విజయవాడ కేంద్రాల్లో చేరాలంటే వీరిని సంప్రదించాలి. నల్లగొండ, ఖమ్మం జిల్లాల అడ్మిషన్స్ ఇన్‌చార్జి వి.ఏక స్వామిరెడ్డిని 7997995697లో సంప్రదించాలి.

### అవగాహన కల్పించి.. భరోసా నింపి..!

విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ విద్య కీలకం. ఈ దశలో తప్పటడుగు వేస్తే భవిష్యత్ అంధకారం అవుతుంది. రెండేండ్ల ఇంటర్మీడియట్‌ను ప్రణాళికతో చదివితే జీవితంలో ఏ రంగంలో స్థిరపడాలో ఇక్కడే బాటలు వేసుకోవచ్చు. అయితే.. ఇంటర్మీడియట్ తర్వాత ముఖ్యంగా ఎంపీసీ, బీపీసీ విద్యార్థులు ఏం చదువాలి.. త్వరగా స్థిరపడడానికి ఎలాంటి కోర్సులు ఎంచుకోవాలి.. వాటిని అభ్యసించడానికి ఎలాంటి విద్యా సంస్థలో చేరాలి. అనే అంశాలపై నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'లక్ష్యం –2024' పేరుతో నల్లగొండలోని ప్రగతి జూనియర్ కళాశాలలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఇంటర్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉన్నత విద్యపై ఎలాంటి అవగాహన, ఆలోచన లేని తమకు ఇంటర్మీడియట్ తర్వాత తమ ఉజ్వల భవిష్యత్తుకు ఎలా బాటలు వేసుకోవాలో.. నేటి ఆధునిక ప్రపంచంలో ఎలా ముందుకు సాగితే జీవిత లక్ష్యం చేరుకుంటామనే దానిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి భరోసా నింపారని విద్యార్థులు పేర్కొన్నారు. సదస్సు నిర్వహించిన కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీకి, నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. సదస్సులో నమస్తే తెలంగాణ బ్రాంచ్ మేనేజర్ తొవిటి మహేందర్, బ్యూరో ఇన్‌చార్జి మర్రి మహేందర్‌రెడ్డి, ఏడీవీటీ మేనేజర్ కైరంకొండ శివకుమార్, ప్రగతి జూనియర్ కళాశాల డైరెక్టర్ ఎన్.శశిధర్‌రావు, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అడ్మిషన్స్ నల్లగొండ ఇన్‌చార్జి ఏకస్వామిరెడ్డి, ప్రగతి జూనియర్ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.




లక్కీ డ్రా విజేతకు బహుమతి అందిస్తున్న ప్రగతి కళాశాల డైరెక్టర్ శశిధర్‌రావు

### విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేదే ఇంటిగ్రేటెడ్ మల్టీ కరిక్యులమ్



విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు అందించేదే ఇంటిగ్రేటెడ్ మల్టీ కరిక్యులమ్. విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ రెండేండ్లు కీలకం. భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు ఇక్కడే చక్కటి అవకాశాలను ఎంపిక చేసుకోవాలి. అత్యంత నాణ్యతా ప్రమాణాలతో విద్యనందించి ఉజ్వల భవిష్యత్తుకు తీసుకెళ్లే విద్యా సంస్థల్లో చేరితే మంచి అవకాశాలు వస్తాయి. ఇందు లో భాగంగానే 'లక్ష్యం – 2024'తో సదస్సులు నిర్వహిస్తూ విద్యార్థుల్లో అవగాహన పెంచుతున్నాం. ఇంజినీరింగ్‌పై చాలా మందికి అవగాహన లేక కోర్సుల ఎంపికలో తప్పులు చేస్తూ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అత్యుత్తమ ప్రమాణాలు, విలువలతో కూడిన విద్యను అందిస్తున్నది.

– షణ్ముఖ కుమార్, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విజయవాడ ప్రొఫెసర్


### జిల్లా కేంద్రాల్లో విద్యా సదస్సులు అభినందనీయం



విద్యా సమాచారాలకు సంబంధించిన అవగాహన సదస్సులు గతంలో మెట్రో పాలిటన్ సిటీల్లో నిర్వహించేవారు. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దినపత్రికలు కేవలం వార్తలనే కాకుండా విద్య, ఉద్యోగ సమాచారాలను కూడా అందిస్తున్నాయి. అందులో భాగంగానే మా సంస్థలు, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ సంయుక్తంగా లక్ష్యం –2024 పేరుతో ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్యా అవకాశాలపై సదస్సు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాయి.

– తొవిటి మహేందర్, బ్రాంచ్ మేనేజర్, నమస్తే తెలంగాణ

### సదస్సు ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నా



నేను బీటెక్ సివిల్, మెకానికల్ కోర్సులు చేయాలనుకుంటున్నా. అయితే.. ఈ కోర్సుల్లో అమ్మాయిలు చేరితే భవిష్యత్ ఉండదని, చాలా కష్టమని అంటున్నారు. వీటిపై వివరణ కావాలని సదస్సు తర్వాత నేను వేదికపై మాట్లాడిన. నా సందేహాలను కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ శ్రీనివాస్‌రావు చక్కటి వివరణ ఇచ్చారు. ఇలాంటి సందేహాలు తెలుసుకునే చక్కటి అవకాశం మా కళాశాలలో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే, కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వారు నిర్వహించిన లక్ష్యం – 2024 సదస్సుతో తెలుసుకున్నా. భవిష్యత్‌లో ఎలా చదువాలి, ఎలాంటి కోర్సు తీసుకోవాలో తెలిసింది. ఈ సదస్సు ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నా.

– జెనిరియా ముస్కాన్, ఎంపీసీ, సెకండియర్